సాక్షి జయశంకర్ భూపాలపల్లి

గురువారం | 29 | జూన్ | 2023



త్యాగానికి ప్రతీక బక్రీద్

జిల్లా వ్యాప్తంగా నేడు (గురువారం) బక్రీద్ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు.

- 8లో▸



కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు

పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం

31.0^{0} / 26.0^{0}

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘ఉపా’ను రద్దు చేయాలి

టేకుమట్ల: చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ‘ఉపా’ను వెంటనే రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మారెపెల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంఘాల నాయకులు, హక్కుల కార్యకర్తలు, ప్రొఫెసర్లు, మేధావులు, జర్నలిస్టులు, ప్రశ్నించే గొంతులపై దేశ వ్యాప్తంగా ఉపా కేసులు నమోదు చేయడం అప్రజాస్వామికమన్నారు. అమాయకులపై కేసులు పెడుతూ వారి హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. 2022 ఆగస్టు 19న ములుగు జిల్లా పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు కూంబింగ్ నిర్వహించగా దొరికిన పత్రాల్లో పేర్లు ఉన్నాయని, కొందరిని అరెస్టు చేసి పోలీసులు ప్రజావ్యతిరేకతతో కేవలం ఐదుగురిపై కేసులు ఎత్తి వేశారని, మిగతా వారిపై ఇప్పటికీ కేసులు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడేవారిపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కసరవేని కుమార్, ఆకునూరి జగన్, పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

భూపాలపల్లి అర్బన్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైఖ్య జిల్లా నూతన కమిటీ అధ్యక్షురాలిగా వి.విజయలక్ష్మిని నియమించినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నళిగంటి రత్నమాల తెలిపారు. జిల్లా కేంద్రంలోని మల్లు స్వరాజ్యం స్మారక భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రథమ సభకు రత్నమాల ముఖ్య అతిథిగా హాజరై కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా యేసు ప్రీతి, ఉపాధ్యక్షులుగా శ్రీలత, రజిత, రాజేశ్వరి, సహాయ కార్యదర్శులుగా సరిత, అన్నపూర్ణ, సారమ్మ, రజిత, కోమలను ఏకగ్రీవంగా నియమించినట్లు తెలిపారు.

1 నుంచి ఆపరేషన్ ముస్కాన్



భూపాలపల్లి: జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్కాన్–9 స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా అడ్మిన్ ఎస్పీ వి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆపరేషన్ ముస్కాన్ స్పెషల్ డ్రైవ్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అడ్మిన్ ఎస్పీ మాట్లాడుతూ.. నిస్సహాయ పిల్లల కోసం అంకితభావంతో పనిచేయాలని, పోలీసు శాఖతో పాటు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి, సత్ఫలితాలు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఎస్సై ఊర్మిళ, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్ పాల్గొన్నారు.

పదోన్నతి బాధ్యత పెంచుతుంది

భూపాలపల్లి: అధికారులకు పదోన్నతులు బాధ్యతలను మరింత పెంచుతాయని ఎస్పీ సురేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ డీఎస్పీగా పదోన్నతి పొందిన జానీ నర్సింహులు బుధవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిజాయితీ, అంకిత భావంతో పనిచేస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ప్రభుత్వాసుపత్రిలో 24 గంటల్లో 13 కాన్పులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో 24గంటల్లో (మంగళవారం తెల్లవారు జాము నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు) వైద్యులు 13 కాన్పులు చేసి రికార్డు సాధించారు. 4 సాధారణ, 9 సిజేరియన్ డెలివరీలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ జీడి తిరుపతి తెలిపారు. అయితే ఆస్పత్రి ప్రారంభించిన మూడేళ్లలో ఒకే రోజు ఇన్ని డెలివరీలు చేయడం ఇదే ప్రథమమని వెల్లడించారు. గైనకాలజీస్టులు, వైద్య సిబ్బందిని సూపరింటెండెంట్ అభినందించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అనిషా, డాక్టర్ రాజేష్, ఎస్ఆర్ డాక్టర్ ప్రవీణు డెలివరీలు చేసినట్లు తెలిపారు.

ప్రొఫెసర్లకు సింగరేణి క్వార్టర్లు

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లిలోని మెడికల్ కాలేజీకి నియమితులైన ప్రొఫెసర్ల కోసం సింగరేణి రామప్ప క్వార్టర్లలోని 3 బ్లాక్‌లను కేటాయించినట్లు కలెక్టర్ భవేష్‌మిశ్రా తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం కలెక్టర్ భవేష్‌మిశ్రా, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజ్‌దేవిడే సింగరేణి జీఎం శ్రీనివాసరావుతో కలిసి క్వార్టర్లను సందర్శించారు. మూడు బ్లాక్‌లలో వారికి కావలసిన మౌలిక వసతులు, మెస్‌ను నెలకొల్పాలని కలెక్టర్ సింగరేణి అధికారులను కోరారు. ఇందులో భాగంగా మహిళా ప్రొఫెసర్లకు పురుషులకు వేర్వేరుగా క్వార్టర్స్‌ను కేటాయించగా.. మెస్ కూడా అలాగే కేటాయించాలని తెలిపారు.

ఇక నకిలీకి చెక్

విత్తన ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్

- ప్రస్తుత సీజన్ నుంచే అమలు

భూపాలపల్లి రూరల్: నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతులు మోసపోకుండా ఉండేందుకు విత్తన ప్యాకెట్లపై విధిగా క్యూఆర్ కోడ్ ముద్రించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీడ్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశాయి. ప్రస్తుతం వానాకాలం పంటల సాగుకు రైతులు విత్తనాల కొనుకోలుకు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో మార్కెట్‌లో రైతులకు విక్రయించే పత్తి విత్తన ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ముద్రించాలని విత్తన కంపెనీలకు కేంద్రం సూచించింది. జిల్లాలో సాగు చేసే మొక్కజొన్న, పత్తి, వరి విత్తనాలకు ప్రైవేట్ కంపెనీలే దిక్కు. ఈక్రమంలో అమాయక రైతులకు నకిలీ, నాసిరకం సీడ్స్ కట్టబెట్టేందుకు కొంతమంది దళారులు సిద్ధమయ్యారు. దీన్ని ఆరికట్టేందుకు క్యూఆర్‌కోడ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడం రైతులకు ఊరట కలిగించే అంశం.

2.44లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలోని 11మండలాల్లో ఈసీజన్‌లో 2.44లక్షల ఎకరాల్లో రైతులు పంటల సాగు చేయనున్నట్లు సంబంధిత అధికారుల అంచనా.. ఇందులో పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలే అధికం. సీజన్‌ప్రారంభం కావడంతో పలు రకాల కంపెనీలు తమ విత్తనాలను మార్కెట్‌లోకి విడుదల చేశాయి. ఇందులో ఏవి నకిలీ..? ఏవి అసలివో తెలియని పరిస్థితి నెలకొంది. కంపెనీలు విక్రయించే విత్తనాల్లో ఒక్కోసారి నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోయిన సందర్భాల్లో పలు రకాల కారణాలు చెప్పి పరిహారం ఇవ్వడం లేదు. దీంతో నకిలీ విత్తనాలతోపాటు నాసిరకం విత్తనాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం విత్తనాల ప్యాకెట్లపై క్యూఆర్‌కోడ్ తప్పనిసరి చేసింది.

పూర్తి సమాచారం..

కంపెనీలు విక్రయించే విత్తనాల ప్యాకెట్లపై విత్తనాల లాట్ సంఖ్య, ఎక్కడ పండించారు. వంగడం రకం పేరు, ఎక్కడ శుద్ధి చేశారు. వాటి సాగు కాల పరిమితి, విత్తనాన్ని సర్టిఫైడ్ చేసిన సంస్థ పేరు, చిరునామా, జన్యుపరమైన వివరాలు క్యూఆర్‌కోడ్‌లో ఉంటాయి. మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న, వరి విత్తనాల విక్రయం ఎక్కువగా ఉంటుంది. కొన్ని చోట్ల అయితే అసలు విత్తనాల కన్నా ముందే నకిలీ విత్తనాలు ప్రక్క రాష్ట్రాలనుంచి మార్కెట్‌లోకి వచ్చేస్తుంటాయి. నకిలీ విత్తన సంచులపై లేబుల్ నంబర్, లాట్ నంబర్, విత్తనాలను పరీక్షించిన తేది, ప్యాకింగ్ తేది, వ్యాలీడిటీ ఎమ్మార్పీ.. ఇవేవి ఉండవు. కొన్ని కంపెనీలు బోగస్ లేబుళ్లు వేసి నాసిరకం విత్తనాలు విక్రయించిన సందర్భాలు అనేకం. ఈ సమస్యను అధిగమించేందుకు క్యూఆర్ కోడ్ తప్పనిసరి చేసినట్లు తెలుస్తోంది. గతేడాది ప్రభుత్వ రంగ సంస్థలు విక్రయించే విత్తనాలపై క్యూఆర్ కోడ్‌లు ముద్రించగా, ఈసీజన్ నుంచి ప్రైవేట్ కంపెనీలు విక్రయించే ప్యాకెట్లపై కూడా కోడ్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాయి. అయితే కొన్ని పేరు పొందిన కంపెనీలు మాత్రం ఇప్పటికే క్యూఆర్ కోడ్ ముద్రించి విత్తనాలు విక్రయిస్తుంటే.. కొన్ని కంపెనీలు కోడ్ లేకుండానే విక్రయిస్తున్నాయి.



షాపులో విక్రయానికి సిద్ధంగా ఉన్న విత్తన ప్యాకెట్లు



విత్తన ప్యాకెట్‌పై క్యూఆర్ కోడ్‌తో లేబుల్

జిల్లాలో సాగు వివరాలు అంచనా (ఎకరాల్లో)

వరి	1,05,600
పత్తి	1,02,600
మొక్కజొన్న	560
జొన్న	250
వేరుశనిగ	220
పెసరు	820
ఆయిల్‌పామ్	4,250
మిర్చి	22,320
పసుపు	1,068
ఇతర పంటలు	6,450

రైతులు రశీదు తీసుకోవాలి..



విత్తనాల ప్యాకెట్లపై కొన్ని కంపెనీలకు క్యూఆర్ కోడ్‌లు ఉన్నాయి. మరి కొన్నింటికి లేవు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న విత్తనాల ప్యాకెట్లకు క్యూఆర్ కోడ్ ఉంటుంది. దీంతో రైతులు నష్టపోయే అవకాశం ఉండదు. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రైతులు తప్పకుండా రశీదును భద్రపరుచుకోవాలి. రైతులు పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతనే విత్తనాలు కొనుగోలు చేయాలి.

- విజయ్‌భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

పకడ్బందీగా గ్రూప్- 4 పరీక్షల నిర్వహణ

- 29 కేంద్రాలు, 7,482 అభ్యర్థులు
- కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి: జిల్లాలో జూలై 1న నిర్వహించనున్న గ్రూప్ –4 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి సజావుగా నిర్వహించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దివాకరతో కలిసి బుధవారం గ్రూప్ –4 పరీక్ష సన్నద్ధతపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రూప్ 4 పరీక్షలకు జిల్లాలో టీఎస్‌పీఎస్సీ నియమ, నిబంధనల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి అభ్యర్థులు సజావుగా పరీక్షలు రాసేలా చూడాలని ఆదేశించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలో 29 సెంటర్లలో మొత్తం 7,482 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. గైడ్ లైన్స్‌ను ప్రతీ ఒక్కరూ చదివి, నిబంధనలు పాటించాలని, లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షా కేంద్రాలను ముందస్తుగా సందర్శించి తాగు నీరు, విద్యుత్, సీటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర మౌలిక వసతులను సరి చూసుకోవాలని సూచించారు. పరీక్ష తేదీన పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అడ్మిన్ ఎస్పీ శ్రీనివాసులు, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

యువతే రాజకీయ ప్రక్షాళన చేయాలి

- రాజకీయాల్లో విలువలు పడిపోతున్నాయి..
- టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రొఫెసర్ రియాజ్

భూపాలపల్లి రూరల్: యువతే రాజకీయాలను ప్రక్షాళన చేయాలని, అందుకోసం యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రొఫెసర్ ఎండీ రియాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ అధ్యక్షతన రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌పై విద్యార్థులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో రియాజ్ మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాల్లో నానాటికీ విలువలు పడిపోతున్నాయని, వాటిని గాడిలో పెట్టి సమాజాన్ని బాగు చేయాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకు యువత రాజకీయాల్లోకి రావాలని సూచించారు. రాష్ట్రంలో నిరంకుశ పాలనను తరిమికొట్టడానికి విద్యార్థులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించబోయే రాజీవ్ గాంధీ ఆన్లైన్ కాంపిటీషన్ పోటీలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ రియాజ్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానం చేశారు. సదస్సులో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు దబ్బేట రమేష్, బుర్ర కొమురయ్య, అంబాల శ్రీనివాస్, దాట్ల శ్రీనివాస్, నగునూరి రజినీకాంత్, ప్రేమ్, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రియాజ్

అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి

మల్హర్: నకిలీ విత్తనాలపై అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వల్లెకుంట గ్రామంలో నకిలీ విత్తనాలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై డీఎస్పీ రాంమోహన్ బుధవారం రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులు వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో పంట వేయక ముందే నకిలీ విత్తనాలని గుర్తిస్తే ఆర్థికంగా నష్టపోకుండా ఉండొచ్చని సూచించారు. ప్రభుత్వ లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని , విత్తన ప్యాకెట్లపై కంపెనీ హోలోగ్రాం సరి చూసుకోవాలని తెలిపారు. తక్కువ ధరకు వస్తున్నాయని నాసిరకం విత్తనాలు కొనొద్దని వివరించారు. కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, మందులకు రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని చెప్పారు. నకిలీ విత్తనాలకు విక్రయించిన డీలర్లపై పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాలతో నేరాలని నియంత్రించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాటారం సీఐ రంజిత్‌రావు, కొయ్యూరు ఎస్సై నరేష్, సర్పంచ్ రమేష్, పోలీసు సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రాంమోహన్‌రెడ్డి

ప్రణాళికతోనే లక్ష్యం చేరగలం

భూపాలపల్లి అర్బన్: లక్ష్యం చేరడానికి శ్రద్ధ పట్టుదలతోపాటు, ప్రణాళిక అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్ అన్నారు. ఇటీవల ప్రకటించిన నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కాటారం మండలంలోని గంగారం గ్రామానికి చెందిన ములుకల్ల స్ఫూర్తి 720 మార్కులకు గాను 603 మార్కులు సాధించి ప్రతిభ కనపరచగా డీఈఓ కార్యాలయంలో స్ఫూర్తిని బుధవారం సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ రాంకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన గుణాత్మకమైన విద్య లభిస్తుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. స్ఫూర్తి ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు కాటారం మోడల్ స్కూల్‌లో చదివినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓ కిషన్‌రావు, ఎస్ఓలు రాజగోపాల్, కరుణాకర్, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ శనగరపు భద్రయ్య, యూనియన్ నాయకుడు తిరుపతి పాల్గొన్నారు.



స్ఫూర్తిని సన్మానిస్తున్న డీఈఓ

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా కన్వీనర్ బోనాల రాజమౌళి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్) ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. పీఆర్‌సీ కాల పరిమితి ముగిసినందున 2023 జూన్ నుంచి అమలయ్యే విధంగా కొత్త పీఆర్‌సీ కమిటీని నియమించాలని కోరారు. బకాయిలో ఉన్న 2 డీఏలను విడుదల చేయాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీము పటిష్టం, నగదు రహిత వైద్యాన్ని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు చెల్లించాలని, నెలల తరబడి ఈ– కుబేర్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు. కనీస పెన్షన్ రూ.30వేలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ భవేష్‌మిశ్రాకు అందజేశారు. కార్యక్రమంలో జాక్ పరిశీలకులు పెండ్యాల బ్రహ్మయ్య, జిల్లా కో కన్వీనర్ వరుణకుమారి, కరుణాకర్‌రావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

ములుగు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ములుగు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్ అన్నారు. ఈ మేరకు బుధవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంజిత్, రాజ్‌కుమార్, వినోద్, పవన్, కార్తీక్, అవినాష్, దినేష్, ప్రవీణ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మండలంగా గోరికొత్తపల్లి

- ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేస్తూ ప్రభుత్వ జీఓ
- కొత్త మండలంలో ఏడు రెవెన్యూ గ్రామాలు

భూపాలపల్లి: మూడున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న పలు గ్రామాల ప్రజల కల ఎట్టకేలకు నెరవేరింది. కొత్తపల్లిగోరిని మండలంగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం తుది నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అతి పెద్ద మండలంగా ఉన్న రేగొండ విభజించబడి మరో మండలం ఏర్పాటు కాబోతుంది. ఫలితంగా పరిపాలన మరింత సులభతరం కానుంది.

జిల్లాలో ఇక 12 మండలాలు..

జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పడిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలం ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అతి పెద్దది. ఈ మండలం 234 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉండగా 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాగా రేగొండను విభజించి కొత్తపల్లిగోరి మండలాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు స్పందించిన సర్కారు ఈ ఏడాది జనవరి 7న డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అభ్యంతరాల స్వీకరణ తదితర కార్యక్రమాల అనంతరం బుధవారం 7 రెవెన్యూ గ్రామాలతో కూడిన కొత్తపల్లిగోరి మండలాన్ని ఏర్పాటు చేస్తూ తుది నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కొత్తగా ఏర్పడిన ఈ మండలంలో కొత్తపల్లిగోరి, చెన్నాపూర్, చిన్నకోడెపాక, జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్, జంషెడ్ బేగ్‌పేట్, కోనరావుపేట రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి.

గ్రామస్తుల సంబురాలు

కొత్తపల్లిగోరి మండలం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో గ్రామస్తులు బుధవారం సంబురాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. తమ ఆకాంక్షను నెరవేర్చిన సర్కారుకు కృతజ్ఞతలు తెలిపారు.



గ్రామంలో సంబురాలు జరుపుకుంటున్న ప్రజలు

పాఠశాలల సందర్శన

ఎస్ఎస్ తాడ్వాయి: మండల పరిధిలోని బీరెల్లి, అంకంపల్లి, కాటాపూర్, నర్సాపూర్ పాఠశాలలను ఇన్‌చార్జ్ ఎంఈఓ యాప సాంబయ్య, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి రేగ కేశవరావులు బుధవారం పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న పఠనోత్సవంతో పాటు విలేజ్ ఎడ్యుకేషన్ తీరును పరిశీలించారు. రిజిస్టర్‌లో జీరో నుంచి 15 ఏళ్ల వయస్సు వరకు పిల్లల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని, విద్యార్థులు ఏయే పాఠశాలల్లో చదువుతున్నారనే విషయాలను పొందుపర్చాలని హెచ్ఎంలకు సూచించారు. బడిబాట కార్యక్రమాన్ని కొనసాగించి, బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

మూడు గ్రామాల విలీనం

టేకుమట్ల: చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం, కాల్వపల్లితోపాటు, పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని శాత్రాజుపల్లి గ్రామాలను టేకుమట్ల మండలంలో విలీనం చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా గిద్దెముత్తారం, కాల్వపల్లి గ్రామాల ప్రజలు టపాసులు పేల్చి, స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. అయితే ఉమ్మడి చిట్యాల మండలం నుంచి టేకుమట్ల నూతన మండలంగా ఏర్పడిననాటి నుంచి కాల్వపల్లి, గిద్దెముత్తారం గ్రామాల ప్రజలు టేకుమట్ల మండల కేంద్రం దాటి మరో 11 కిలో మీటర్ల దూరంలో ఉన్న చిట్యాలకు అవసర నిమిత్తం వెళ్లేవారు. కాల్వపల్లి, గిద్దెముత్తారం గ్రామాలను టేకుమట్ల మండలంలో విలీనం చేయాలని కోరుతూ గతంలోనే ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం గౌరవించి టేకుమట్ల మండలంలో గ్రామాలను విలీనం చేయడం సంతోషకరమని టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి తెలిపారు.



నినాదాలు చేస్తున్న ప్రజలు

ప్రాధాన్యతా రంగాలకు రుణాలివ్వాలి

జాయింట్ కలెక్టర్ స్వర్ణలత

భూపాలపల్లి రూరల్: బ్యాంకులు ప్రాధాన్యతా రంగాలకు రుణాలు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ స్వర్ణలత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రగతి భవన్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ స్వర్ణలత బ్యాంకర్ల కో–ఆర్డినేషన్ కమిటీతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రుణ లక్ష్య సాధనలో మరింత ప్రగతి సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. జిల్లాలో పంట రుణాలు, హౌసింగ్ లోన్, ఎడ్యుకేషన్ లోన్ తదితర లోన్ల వివరాలు బ్యాంకుల వారీగా సమీక్షించారు. ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా రుణాలు అందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న యూనిట్ల రుణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు గ్రామ స్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. జిల్లాలోని రైతు వేదికల్లో ప్రతినెలా సమావేశాలు నిర్వహించి, రుణ ప్రగతి పెంచేందుకు మండల స్థాయి అధికారులతో కలిసి కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అదే విధంగా కోళ్ల ఫారాల ఏర్పాటుకు, సెరీకల్చర్‌కు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చేలా చూడాలన్నారు. పట్టణ ప్రాంతంలో వీధి వ్యాపారుల రుణాలు సకాలంలో ఇవ్వాలని ఆదేశించారు. విద్యారుణాలు అందించి విద్యాభివృద్ధి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఐఎల్‌డీఓ అలీ బాబా, నాబార్డ్ ఏజీఎం రవి, డీఆర్‌డీఓ పురుషోత్తం, ఎల్‌డీఎం తిరుపతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణలత

క్లుప్తంగా

కస్టడీకి రిటైర్డ్ ఎంపీడీఓ హత్య కేసు నిందితులు


జనగామ సబ్ జైలు నుంచి నిందితులను కస్టడీలోకి తీసుకుంటున్న పోలీసులు

జనగామ: రిటైర్డ్ ఎంపీడీఓ రామ కృష్ణయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడు గిర బోయిన అంజయ్యతో పాటు శ్రీకాంత్, భాస్కర్‌ను పోలీసులు బుధవారం తమ కస్టడీకి తీసుకున్నారు. వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి మనీషా మెహ్రా నిందితులను రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. 11 రోజులు జనగామ సబ్ జైలులో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు ఉదయం కస్టడీలోకి తీసుకున్నారు. రామకృష్ణయ్య హత్య కేసు విషయంలో రెండు రోజులు విచారణ చేసిన అనంతరం, వీరిని తిరిగి కోర్టుకు అప్పగించాల్సి ఉంటుంది.

నిట్‌లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభం


ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ కెమిస్ట్రీ విభాగ ప్రొఫెసర్ వి.రాజేశ్వర్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆర్గానిక్ అండ్ మెడిసినల్ కెమిస్ట్రీ-23 అంశంపై మూడు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ విధానంతో ఆర్గానిక్ మెడిసిన్‌లో నూతన ఆవిష్కరణలకు వేదికగా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో ఇజ్రాయిల్‌కు చెందిన నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అదా యోనాథ్, ప్రొఫెసర్లు డి.బసవయ్య, మహేశ్ లక్ష్మణ్, రామాచారి, పటేల్‌గాహతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజేశ్వర్ రావు దంపతులను ఘనంగా సన్మానించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్..

దైవాజ్ఞను శిరసావహిస్తూ తన సొంత కుమారుడినే బలి ఇవ్వడానికి సిద్ధమైన తండ్రి.. ఆయన నిర్ణయానికి ఎలాంటి అడ్డు చెప్పకుండాతన ప్రాణం అర్పించడానికి సిద్ధపడిన కుమారుడు.. వీరి భక్తికి ప్రసన్నుడైన దైవం... కత్తిని కుమారుడి గొంతుపై ఎక్కుపెట్టే క్రమంలో ఆయన స్థానంలో దుంబ(గొరెపోతు) ప్రత్యక్షమయ్యేలా చేశారు. దీంతో ఆ రోజును ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ (ఈదుల్ జుహా)పండుగగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం ఉదయం ఈ పండుగ అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్యాగానికి ప్రతీకైన ఈదుల్ జుహా (బక్రీద్) పర్వదినంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

–హసన్‌పర్తి/ కాజీపేట/ఖిలావరంగల్


ఖిలా వరంగల్ ఈద్గా ప్రాంగణం

- నేడు ఈదుల్ జుహా వేడుకలు
- ముస్తాబైన ఈద్గాలు, మజీద్‌లు

ఇబ్రహీంకు అనేక పరీక్షలు..

పూర్వీకుల కథనం ప్రకారం మహ్మద్ ఇబ్రహీం.. దేవుడి (అల్లా) ప్రియమైన భక్తుడు. అతడి భక్తిని పరిశీలించడానికి అల్లా అనేక పరీక్షలు పెట్టాడు. ఓ రోజు దైవం.. ఇబ్రహీం కలలోకి వచ్చి నీ ప్రియమైన కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లాకు బలి ఇవ్వాలని ఆజ్ఞాపించాడు. దీనికి ఇబ్రహీం ఏమీ ఆలోచించకుండా భార్యకొడుకును తీసుకుని ఓ నిర్జీవ ప్రదేశానికి బయలుదేరాడు.అయితే మార్గమధ్యలో భార్య ఎక్కడి తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా.. ఇది దైవాజ్ఞ అని చెప్పడంతో ఆమె బదులివ్వదు. ఈ క్రమంలో ఇబ్రహీం వెళ్తుండగా సైతాన్ ఆయనను వెంబడిస్తూ నీవు చేయబోతున్న పని మంచిది కాదు.. కలలో వచ్చి కొడుకును బలిఇవ్వమంటే ఇస్తావా..ఇది న్యాయం కాదు.. నీవు చేయబోతుంది పొరపాటని ఇబ్రహీం మనస్సును సైతాన్ పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తుంది. అయినా ఇబ్రహీం ..సైతాన్ మాటలు లెక్కచేయకుండా దైవ కార్యంలో లీనమై ముందుకు సాగాడు. ఇస్మాయిల్‌ను నిర్జీవ ప్రదేశానికి తీసుకెళ్లాడు. అయితే గొంతుపై కత్తి ఎక్కిపెట్టడానికి తండ్రి సహసించడని భావించిన ఇస్మాయిల్.. కళ్లకు గంతలు కట్టుకుని బలి ఇవ్వాలని తండ్రిని కోరాడు. కుమారుడు చెప్పిన విధంగా ఇబ్రహీం కత్తితో కుమారుడి గొంతుపై ఎక్కిపెట్టే క్రమంలోనే ఇస్మాయిల్ స్థానంతో దుంబ(గొరెపోతు) ప్రత్యక్షమవుతుంది. ఇబ్రహీం ఆ గొర్రెపోతును జుబహ్ చేశాడని గ్రంథాలు చెబుతున్నాయి.

ఖుర్బానీ ప్రత్యేకత..

ప్రతి మనిషి తన ప్రాణ రక్షణ కోసం ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ. దైవాజ్ఞ మేరకు ఇస్మాయిల్‌ను బలి ఇస్తుండగా ఆయన స్థానంలో (గొర్రెపోతు) ప్రత్యక్షమై ఇస్మాయిల్ ప్రాణాలు రక్షిస్తున్నది. ఖుర్బానీ ఇస్తే ప్రాణాలు, ఆస్తులు రక్షించబడుతాయని ఖుర్బాన్‌లో పేర్కొని ఉంది. దీంతో ఏటా బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ(బలి) ఇవ్వడం ఆనవాయితీగా మారింది.

సామూహిక ప్రార్థనలకు సర్వం సిద్ధం

ఈద్గాలో గురువారం ఉదయం 8.30 గంటలకు ఈదుల్ జుహా ప్రత్యేక ప్రార్థనలు జరుగనున్నాయి. బుధవారం స్థానిక కార్పొరేటర్ సిద్ధం రాజు, ఎమ్మెల్యే నరేందర్ ఈద్గాను సందర్శించారు.బల్దియా ఆధ్వర్యంలో ప్రార్థన స్థలం ముస్తాబు చేశాం. ముస్లింలు సకాలంలో హాజరై ప్రార్థనలు చేయాలి.

ఎంఏ జబ్బార్, ఫోర్ట్‌రోడ్డు ఈద్గా ప్రతినిధి

ముస్తాబైన ఈద్గాలు, మజీద్‌లు

ఈదుల్ జుహా నమాజ్ కోసం మసీదులు ముస్తాబయ్యాయి. ఆయా ఈద్గాలు, మజీద్‌ల్లో గురువారం ఉదయం 8 గంటల లోపే ప్రత్యేక నమాజ్ పూర్తిచేయనున్నారు. ఈమేరకు ఆయా మజీద్‌ల కమిటీలు ప్రకటనలు కూడా చేశాయి.

పొట్టేళ్లు రెడీ..


కాజీపేటలో పొట్టేళ్లను విక్రయిస్తున్న వ్యాపారులు

కాజీపేట: బక్రీద్ పండుగ సందర్భంగా పొట్టేళ్ల విక్రయాలు జోరుగా సాగుతాయి. ఈ పర్వదినం సందర్భంగా ఖుర్బానీ ఇవ్వడం ముస్లింల ఆచారం. ఈ క్రమంలో వరంగల్ నగరంలోని అనేక ప్రాంతాల్లో వారం ముందు నుంచే పొటేళ్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పర్వదినానికి శరీరంపై ఎలాంటి గాయాలు లేని పొటేళ్లనే ఎక్కువగా కొనుగోలు చేయడానికి ఇష్టపడుతుంటారు. ధర ఎంతైనా సరే పొటేళ్ల మాత్రమే కొనుగోలు చేస్తారు.

పొట్టేళ్ల ధర రూ.12వేల వరకు...

బక్రీద్ సందర్భంగా పొట్టేళ్ల ధర రూ.4 నుంచి రూ.12వేల వరకు పలుకుతోంది. ఆరోగ్యంగా, బలంగా ఉన్న పొట్టేళ్లను గొర్రెలకాపరులు అధిక ధరకు విక్రయిస్తున్నారు. కాగా, బక్రీద్ రోజు దాదాపు వరంగల్ నగరంలో 10వేలకు పైగా పొట్టేళ్లు బలి ఇస్తారని ముస్లింలు చెబుతున్నారు.

'జీనోమ్ ఎడిటింగ్'తో విప్లవాత్మక మార్పులు


కాన్ఫరెన్స్‌కు హాజరైన విదేశీ, స్వదేశీ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు

- సైంటిస్టు ఎంజీకే జోన్స్
- కేయూలో రెండో రోజు కొనసాగిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్


మాట్లాడుతున్న ప్రొఫెసర్లు ఎంజీకే జోన్స్, శ్రీల మిత్ర,జెన్నిఫర్ అన్నహరికృష్ణ

కేయూ క్యాంపస్ : మొక్కలలో జన్యుసవరణలతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆస్ట్రేలియా ముర్దోక్ వర్సిటీ సైంటిస్టు ఎంజీకే జోన్స్ అన్నారు. కేయూలోని సెనేట్‌హాల్‌లో నిర్వహిస్తున్న ప్లాంట్ బయోటెక్నాలజీ 'జీనమ్ ఎడిటింగ్' పై నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో బుధవారం ఆయన ప్రసంగించారు. 'జీనోమ్ ఎడిటింగ్' ద్వారా సృష్టించిన నూతన వంగడాలను, పంటలను ఏఏ దేశాలల్లో ఎలా ఉపయోగిస్తున్నారనే అంశంతోపాటు వాటి వినియోగం భవిష్యత్తులో ఎలా ఉంటుందో కూడా వివరించారు. అనంతరం పూణేలోని సావిత్రి బాయి పూలే యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీలమిత్ర .. టమాటా మొక్కల అభివృద్ధిలో వివిధ రకాల ఒత్తిళ్లు, కరువు పరిస్థితులను తట్టుకునేలా ఉండే ప్రయోగాలను వివరించారు, ఓయూ ప్రొఫెసర్ కేవీ రావు.. రసం పీల్చే పురుగులు, క్రిమికీటకాలను తట్టుకునే పత్తి, వరి పంటల గురించి వివరించారు. భారతీయర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సతీశ్ కుమార్.. ట్రాన్స్‌జీన్ టెక్నాలజీ, పరిశోధన గురించి వివరించారు. మలేషియా మలయా యూనివర్సిటీ ప్రొఫెసర్ జెన్నిఫర్ అన్న హరికృష్ణ.. జీవసాంకేతిక జన్యుసవరణల పరిశోధనల ద్వారా నిలబడే అరటి మొక్కలను గురించి వివరించారు. బెంగళూర్ టీఎఫ్ఆర్ ఎన్‌సీబీసీ శాస్త్రవేత్త పీవీ శివ ప్రసాద్.. ఆహార ఉత్పత్తి పెంచడానికి ఉన్న అవకాశాలు వివరించారు. సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రకాశ్ పి కుమార్ మాట్లాడుతూ పంటల అభివృద్ధికి బయో టెక్నాలజీ పరిష్కారమన్నారు. కార్యక్రమంలో కేయూ బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్లు ఎస్ రామస్వామి, ఎ సదానందం, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు రోజారాణి, ఎంవీ రాజం, ప్రశాంత మిశ్రా, కోటా శ్రీనివాస్, కేవీ సరిత, రిటైర్డ్ ప్రొఫెసర్లు చేరాలు, మాధురి, కేయూ బయోటెక్నాలజీ విభాగం అధిపతి వెంకటయ్య, ఏవీ రావు, శాస్త్రీ పాల్గొన్నారు.కాగా, అతిథులు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.

ఆకట్టుకున్న పోస్టర్ల ప్రజెంటేషన్స్..

కేయూలో బయోటెక్నాలజీ విభా గం, యూకే అబెర్విసిత్ వెల్స్ యూనివర్సిటీ కొలబరేషన్‌లో ప్లాంట్ బయోటెక్నాలజీ 'జీనమ్ ఎడిటింగ్' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో పలువురు పరిశోధకులు పోస్టర్లను ప్ర జెంటేషన్ చేశారు. జీవసాంకేతిక పరిజ్ఞానంతో నూ తన వంగడాలు తదితర అంశాలపై అక్కడికి వ చ్చిన పరిశోధకులు, విద్యార్థులకు తెలిపారు. 25 వ రకు పోసర్లు ప్రజెంటేషన్ చేయగా అందులో ప్రతిభ ప్రదర్శించిన వారికి ప్రోత్సాహకంగా ఈనెల 29న ముగింపు సభలో బహుమతులు అందజేస్తారు.

నేడు ముగియనున్న కాన్ఫరెన్స్

కేయూలో మూడు రోజుల నుంచి జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు గురువారం సాయంత్రం ముగియనుంది. ఈముగింపు సదస్సుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, కేయూ మాజీ వీసీ విద్యావతి, కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, రాజమండ్రి ఐసీఏఆర్, సీటీఆర్ఐ డైరెక్టర్ శేషమాధవ్, కేయూ సైన్స్ డీన్ మల్లారెడ్డి, యూజీసీ కోఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ తదితరులు హాజరవుతారు.

అతివేగంతో అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం
- కల్వర్టును ఢీకొన్న బైక్.. అక్కడికక్కడే మృతి


సాయికుమార్ మృతదేహం

నర్సంపేట రూరల్ : చివరి సంవత్సరం.. కళాశాలకు చివరి రోజు.. దీంతో ఓ యువకుడు ఉదయమే కాలేజీకి చేరుకున్నాడు. అక్కడ స్నేహితులతో ఆనందంగా గడిపాడు. స్మృతులను నెమరువేసుకుని ఎంజాయ్ చేశాడు. ఫొటోలు దిగిన అనంతరం మిత్రులకు వీడ్కోలు చెప్పాడు. మధ్యాహ్నం వ్యక్తిగత పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై వరంగల్ వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో అతివేగంగా ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డుతోపాటు కల్వర్టును ఢీకొని కాల్వలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన చింతల చెరువు కుంభం సైదులు, ఉమాదేవి దంపతులకు కుమారుడు సాయికిశోర్ (22), కూతురు వైష్ణవి ఉన్నారు. సాయికిశోర్ వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లిలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. లక్నెపల్లిలో కిరాయికి ఉంటూ రోజూ తన బైక్‌పై కళాశాలకు వెళ్లి వస్తాడు. ఈ క్రమంలో కళాశాలలో చివరి రోజు కావడంతో వైవా పూర్తి చేసుకుని స్నేహితులతో ఆనందంగా గడిపాడు. అనంతరం వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై వరంగల్‌కు వెళ్లి వస్తున్నాడు. అతివేగంగా వస్తూ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డుతోపాటు కల్వర్టు ఢీకొని కాల్వలో పడ్డాడు. గమనించిన స్థానికులు 108లో నర్సంపేటకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. దీనిపై సమాచారం అందుకున్న నర్సంపేట రూరల్ ఎస్సై సురేశ్ నాయక్ మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైరాన్‌పల్లిలో యువకుడు..


సాయికృష్ణారెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లికి చెందిన ఇనుగాల సాయి కృష్ణారెడ్డి (23)నగరంలోని ఓమొబైల్ షాపులో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం బైక్‌పై బైరాన్‌పల్లి నుంచి హన్మకొండ వైపునకు బయల్దేరాడు. మార్గమధ్యలోని వంగపహాడ్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్.. సాయి కృష్ణారెడ్డి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయి కృష్ణారెడ్డికి తీవ్రగాయాలుకాగా నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. కాగా, మృతదేహాన్ని ఎమ్మెల్యే అరూరి రమేశ్ సందర్శించి నివాళులర్పించారు.ఎమ్మెల్యే వెంట సర్పంచ్ సాంబారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని కారు ఢీకొని మహిళ..

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాక వద్ద గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్రగాయాలపాలైన ఓ మహిళ.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. జాన్‌పాకకు చెందిన శివరాత్రి రాధమ్మ(50) తన పెద్ద కుమారుడు రాజేశ్ ఇంటి నుంచి చిన్న కుమారుడు వినేశ్ ఇంటికి వెళ్లడానికి రాత్రి 10 గంటలకు వరంగల్–నర్సంపేట రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో నర్సంపేట వైపునకు వెళుతున్న గుర్తుతెలియని కారు ఢీకొంది. దీంతో రాధమ్మకు తీవ్రగాయాలు కాగా ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. బుధవారం మృతురాలి కుమారుడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

మద్యానికి బానిసైన తండ్రి..

- మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని
- చికిత్స పొందుతూ మృతి..


భవ్యశ్రీ (ఫైల్)

సంగెం: తండ్రి మద్యం మనడంలేదని మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన సంగెం మండలంలోని కుంటపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెండ్లి రసజ్ఞ, రమేశ్ దంపతులకు కూతురు భవ్యశ్రీ(16), కుమారుడు ఉర్జిత్ ఉన్నారు. భవ్యశ్రీ ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. వీరు తమకున్న ఎకరం భూమిలో వ్యవసాయంతో పాటు ఆటో నడుపుకుంటు, ఐనవోలులో హోటల్ ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల మద్యానికి బానిసైన రమేశ్.. నిత్యం భార్యతో గొడవ పడుతున్నాడు. దీంతో భవ్యశ్రీ తండ్రిని అడ్డుకుంటూ గొడవ పడొద్దంటూ వేడుకునేది. ఈ క్రమంలో రమేశ్.. 19వ తేదీన ఉదయం మద్యం సేవించి వచ్చి గొడవ చేస్తున్నాడు. ఇక తన తండ్రి తాగుడు మానడని.. గొడవ తగ్గదని మనస్తాపం చెందిన భవ్యశ్రీ గడ్డి మందు తాగుతుండగా తమ్ముడు ఉర్జిత్ చూసి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వెంటనే 108లో ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. తల్లి రసజ్ఞ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ యాదగిరి తెలిపారు.

కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు

- పురోగతిలో సహకార సంఘాలు
- రూ.12.92 కోట్ల లాభాల్లో వరంగల్ డీసీసీబీ
- బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్

హన్మకొండ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు చెప్పారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్ డీసీసీబీ మహాజన సభ నిర్వహించారు. పూర్వ వరంగల్ జిల్లాల్లోని పీఏసీఎస్ చైర్మన్లు, డీసీసీబీలో సభ్యత్వం కలిగిన చేనేత, గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు. ముందు డీసీసీబీ ప్రగతిని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రవీందర్ రావు మాట్లాడుతూ మీ సేవా కేంద్రాలకు దీటుగా పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కామన్ సర్వీస్ సెంటర్‌ల ద్వారా 300 రకాల సేవలు అందించవచ్చన్నారు. ప్రస్తుతం 30 నుంచి 40 రకాల సేవలు అందించేలా రూపకల్పన చేశామన్నారు. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. పీఏసీఎస్‌లు కేవలం ఎరువుల వ్యాపారం, ధాన్యం కొనుగోళ్లకే పరిమితం కాకుండా వ్యాపారాన్ని విస్తరించాలన్నారు. వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించాలన్నారు. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. వరంగల్ డీసీసీబీ గతేడాది రూ.9 కోట్లలో లాభాల్లో ఉండగా ప్రస్తుతం రూ.12.93 కోట్లకు చేరుకుందన్నారు. ప్రగతిలో రాష్ట్రంలోనే వరంగల్ డీసీసీబీ 3వ స్థానానికి చేరుకుందన్నారు. ఈ సందర్భంగా బకాయిలు తీర్చిన 9 పీఏసీఎస్ చైర్మన్‌లను డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు, సీఈఓ చిన్నారావు, జిల్లా సహకార అధికారులు సన్మానించారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, జిల్లా సహకార అధికారులు జి.నాగేశ్వర్‌రావు, మద్దిలేటి, సయ్యద్ ఖుర్షీద్, కిరణ్‌కుమార్, డీసీసీబీ జనరల్ మేనేజర్ బి.శ్రీధర్, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ, ఏడీ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అర్చక సమాఖ్య కృషితోనే వేతనం పెంపు

- రాష్ట్ర దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కురాకుల జ్యోతి


మాట్లాడుతున్న జ్యోతి

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ అర్చక సమాఖ్య కృషితోనే ధూపదీప నైవేద్య అర్చకులు రూ.6వేల నుంచి రూ.10వేల వేతనం పొందుతున్నారని రాష్ట్ర దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కురాకుల జ్యోతి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో వరంగల్‌జోన్‌లోని దేవాదాయ ధర్మాదాయశాఖ పరిధిలోని కరీంనగర్, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల 6ఏ, 6బి, 6సీ దేవాలయాలు, ధూపదీప నైవేద్య అర్చకులతో ఆత్మీయ సమ్మేళనం, అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అర్చకులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉందన్నారు. వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు మాట్లాడుతూ దేవాలయాల ఆవరణలు పచ్చదనం, పరిశుభ్రతతో ఉండాలని అప్పుడే భక్తి భావన కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ధూపదీప నైవేద్య అర్చకసంఘం అధ్యక్షుడిగా నిట్టూరి సతీష్‌శర్మను ఎన్నుకున్నారు. ఆరు జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లు సులోచన, సుప్రియ, చంద్రశేఖర్, సునీత, నవీన్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, అర్చక జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, జాక్ కన్వీ నర్ డీవీఆర్ శర్మ, సమాఖ్య కార్యదర్శి రత్నాకర్, ఉద్యోగుల సంఘం అర్చకులు కృష్ణమాచారి, రవీంద్రాచారి పాల్గొన్నారు.

అర్చకులకు అవగాహన సదస్సు..

వేదపండితులు నాగిళ్ల షణ్ముఖశర్మ, జితేందర్‌శర్మ, సుహాస్‌శర్మ, వజ్రయ్య, సంపత్‌కుమార్‌శర్మ.. 21 కులాలకు చెందిన అర్చకులకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దేవత విగ్రహాలకు ధూప, దీపాలు, నైవేద్యాలు సమర్పించడం, యాగాలు, పూజలు ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు.

బీసీల మధ్య చిచ్చుపెడుతున్న ప్రభుత్వం

- మండిపడిన బీసీ సంఘాల నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్, పాల్గొన్న బీసీ నాయకులు

హన్మకొండ : బీసీలకు రూ.లక్ష ఇస్తామంటూ బీసీ కులాల మధ్య ప్రభుత్వం చిచ్చు పెడుతుందని బీసీ సంఘాల నాయకులు మండిపడ్డారు. బుధవారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీల వ్యూహరచన సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు రాజ్యాధికారం దిశగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించి బీసీల రాజకీయ నిర్మాణం అనివార్యమనే నిర్ణయానికి వచ్చి ప్రత్యేక పార్టీ ఏర్పాటు దిశగా ఆలోచించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈదునూరి రాజమొగిళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వరంగల్ పూర్తిగా వెనుకబడిపోయిందని, ఇక్కడ మురికివాడలు పెరిగాయని, పేదలకు నేటికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందలేదని, అట్టడుగు అణగారిన వర్గాలు వరదల్లో చిక్కుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల రాజకీయ నిర్మాణాన్ని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చేపడుతున్నామన్నారు. వరంగల్‌లో మరోసారి బీసీ ముఖ్య నాయకుల విస్తృత సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో గాజు యుగేందర్ యాదవ్, శ్రీకాంతా చారి, బండారి రవీందర్, బొల్లంపల్లి సారయ్య, తెలంగాణ కొమురయ్య, కేడల ప్రసాద్, పైండ్ల భిక్షపతి, పొదిల రాజు పాల్గొన్నారు.